యూనిట్ III

# 11. ఈప్స

– కాళోజీ

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఒక మంచికవిత, కథ, నవల, జీవితచరిత్రలను చదివితే ఒక్కొక్కరిని ఒక్కో విధంగా ప్రభావితం చేస్తాయి. జాతీయోద్యమకాలంలో 'భరతఖండంబుచక్కని పాడియావు...' అనే కవిత తెలుగువారిని ఉత్తేజితుల్ని చేసింది. మన జాతిపిత మహాత్మా గాంధీ మంచి పుస్తకాలవల్లే ప్రభావితు లయ్యారు. అలాగే గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' అనే గ్రంథం ఎందరినో ప్రభావితం చేసింది... ఇలా కవులు, రచయితలు తమ రచనలతో ఇతరులను ప్రభావితం చేయగలగాలి.

### ప్రశ్నలు

1. ఈ పేరా దేని గురించి తెలుపుతుంది?
2. మంచికవితలు, కథలు చదివితే మనలో కలిగే భావాలు ఏమిటి?
3. కవులు, రచయితలు ఎటువంటి రచనలు చేయాలి?
4. నీకు తెలిసిన మంచి రచయితలు, కవుల పేర్లు చెప్పండి?
5. వారు ఎందుకు గొప్పవారో చెప్పండి?

### ఉద్దేశం :

కవిత్వం సామాజిక చైతన్యం కలిగించాలి. ఆ నిబద్ధతతోనే కవి తన మనసులో ఉన్న భావాలను లోకానికి ఈ కవితారూపంలో వెల్లడించారు. విభిన్నవ్యక్తుల స్పందన, వివిధ సామాజికపరిస్థితులు కవిత్వంలో ఎలా ప్రతిబింబించాలో అలాంటి అంచనాలు, ఆదర్శాల సమాహారమే ఈప్స. ఈప్స అంటే కోరిక అదే ఈ కవిత ఉద్దేశం

ఈ పాఠం కాళోజీ నారాయణరావు రచించిన 'నా గొడవ' కావ్యంలోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

© SCERT not to be republished


**నా**కున్నది కోరిక
నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని
చదువరులకు కవిత్వంగా ఉండాలని
భావుకులకు మెదడుగా ఉండాలని
మేధావులకు ఎదదగా ఉండాలని
తార్కికులకు కరుణ పుట్టించేదిగా ఉండాలని
చౌకబారు ఇగిలింతలకు గాంభీర్యం గూర్చేదిగా ఉండాలని
గాంభీర్యాడంబరాల సైతం, చిరునవ్వు నవ్వించేదిగా ఉండాలని
మూర్ఛిల్లిన స్నేహాలకు సంజీవినిగా ఉండాలని
రగిలిన కనులను చల్లార్చేదిగా ఉండాలని
విచ్చలవిడి ఆంబోతుకు గుదిబండగా ఉండాలని
గాలిలో తేలే పరిమళంగా ఉండాలని
పొదుగుల్లో చేపులుగా ఉండాలని
అమ్మకంటి చూపుల్లా ఉండాలని
రైతుచూపు కాపుల్లా ఉండాలని
క్రుంగిన ఎదకు దిలాసాగా ఉండాలని
బ్రతుక్కి బాసటగా ఉండాలని
యమునికి పాశంలా ఉండాలని
ఎడారులకు చెలిమెగా ఉండాలని
మంచుకు కుంపటిగా ఉండాలని
జాతికి నీతిగా ఉండాలని, శత్రువుకు భీతిగా ఉండాలని
సరిహద్దుకు రక్షణగా వుండాలని, శిబి శరీరంలా ఉండాలని
బలిత్యాగంలా ఉండాలని, రణవీరుల ప్రాణంలా ఉండాలని
అమరులకు హారంలా ఉండాలని, వేదనకు వేదంలా వుండాలని
గంగకు జీవనంగా ఉండాలని
జీవనమునకు తీరంగా వుండాలని
పాతాళాన్ని పైకి లాగేదిగా వుండాలని
దివిని భువికి దించేదిగా ఉండాలని
ధాత్రిని ధాత్రిగా వుంచేదిగా ఉండాలని
మనిషిని మనిషిగా చేసేదిగా ఉండాలని
నాకున్నది కోరిక.





© SCERT not to be republished

## కవి పరిచయం



కాళోజీ నారాయణరావు 9 సెప్టెంబర్, 1914న వరంగల్ జిల్లా మడికొండలో జన్మించారు. అణాకథలు, కాళోజీ కథలు, తెలంగాణ ఉద్యమకవితలు, మొ॥నవి వీరి రచనలు. ఖలీల్‌జిబ్రాన్ 'దప్రొఫెట్'ను 'జీవనగీతి'గా తెలుగులోకి అనువదించారు. 'ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక' అని నమ్మిన కాళోజీ తన రచనలద్వారా ప్రకంపనలే సృష్టించారు. వీరి రచనల్లో 'నా గొడవ' సుప్రసిద్ధం. 'అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి' అని నినదించారు. సామాజిక, రాజకీయ, పౌరహక్కుల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, అక్షరాలా వెన్నెముకగా నిలిచారు. వ్యావహారిక భాషను తన కవితకు జీవభాషగా మార్చుకుని వ్యంగ్య విమర్శనాత్మక శైలితో తన వాణిని వినిపించిన ప్రజాకవి. వీరి రచనలకూ అనేక పురస్కారాలు లభించాయి. 1992లో భారతప్రభుత్వం 'పద్మవిభూషణ్'అవార్డ్‌తో వీరిని సత్కరించింది. వీరి జన్మదినోత్సవాన్ని 'మాండలిక భాషాదినోత్సవం'గా జరుపుకుంటారు.

### ప్రక్రియ-వచనకవిత

తెలుగులో వచన కవిత ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చింది. ఆంగ్లంలో దీనిని 'Free Verse' అంటారు. ఫ్రీవర్స్ అనగా పద్య, గేయాల్లో ఉండే ఛందస్సు, మాత్రాగణాలతో సంబంధం లేకుండా వాక్యం కింద వాక్యం భావయుక్తంగా, వ్యావహారిక భాషలో రాసే విధానాన్ని వచన కవితగా పిలుస్తున్నాం.

© SCERT not to be republished

### సారాంశం

నాకున్నది ఒక కోరిక. నేను రాసే కవిత నా మనసులోని భావాల అలజడిని మిత్రుడికి రాసిన ఆత్మీయ ఉత్తరంగా ఉండాలి. పుస్తకప్రియులను ఆహ్లాదపరిచే కవిత్వంగా, సౌందర్యారాధకులను ఆలోచింపజేసేదిగా, మేధావుల మనసులను కదిలించేదిగా, తార్కికుల్లో సైతం భావోద్వేగాలు పుట్టించేలా, అమాయకులు ప్రమాదాల్లో పడిపోకుండా కాపాడేదిగా కవిత ఉండాలనేది నా కోరిక. సాహిత్యవిలువలు, రస సౌందర్యం, కవి సమయాలు గురించి తెలియనివారి వెక్కిరింతలు ఆగిపోయే విధంగా భావగాఢతగల కవితగా ఉండాలని, ఆడంబర మనస్తత్వాల్ని సైతం ఆకర్షించేదిగా ఉండాలని, జడత్వం ఆవరించిన స్నేహరాహిత్య హృదయాలకు ప్రాణంపోసే సంజీవనిగా ఉండాలని, కోపంతోనిండిన కనులను శాంతపరచేదిగా, విచ్చలవిడిగా వీధుల్లో తిరుగుతూ అమాయకులను గాయపరిచే ఆంబోతుల్లాంటి మనుష్యుల అకృత్యాలకు కళ్ళెంవేసేలా నా కవిత ఉండాలి.

కవిత్వం గాలిలో తేలివచ్చే సువాసనలాగా, మధురమైన భావాలను మోసుకురావాలి. పొదుగుల నుండి కారుతున్న పాలధారలా కవిత ఉపయోగకరంగా ఉండాలి. అమ్మ కంటిచూపుల్లోంచి కురిసే మమతానురాగాలు, పంటను సంరక్షించే రైతుచూపుల్లోని జాగ్రదవస్థ కవిత్వంలో నిక్షిప్తమై ఉండాలి.

నిరాశతో కుంగిపోయిన మనసుకు ఆనందాన్ని కలిగించి, జీవితంలోని అభద్రతాభావాన్ని తొలగించి జీవనానికి ఆధారంగా కవిత ఉండాలి. అనవసరపు మృత్యుభయాల్ని తొలగిస్తూ యమునికే మృత్యుభీతి కలిగించే విశ్వాసాన్ని కవిత్వం అందించాలి.

దాహంతో గొంతెండిపోయినవారికి చెలిమనీరులా, చలికి వణికిపోయేవారికి ఆరిపోని కుంపటి వెచ్చదనంలా నిత్యం అందుబాటులో ఉండి ప్రజల కష్టనష్టాలలో ఆదుకునేలా కవిత్వం ఉండాలి.

పక్షిప్రాణాన్ని కాపాడటంకోసం తన శరీరంలోని మాంసాన్ని కోసి ఇచ్చిన శిబి దాతృత్వాన్ని, ఆడినమాట నిలబెట్టుకోడానికి ప్రాణాన్నే ఇచ్చిన బలిచక్రవర్తి త్యాగాన్నీ ప్రబోధించేలా కవిత ఉండాలి. దేశ సరిహద్దుల్ని నిరంతరం పరిశీలిస్తూ పహారాకాసే సైనికుడిలా, చావంటే భయం వదలిపెట్టి పోరాడే వీరుడిలా, అమరవీరుడి మెడలో మెరిసే పూలదండలా కవిత ఉండాలి.

పవిత్రమైన వేదం చదివితే కలిగే బహుళ ప్రయోజనాల్లా కవితలోని వేదన పఠితలో గుణాత్మకమయిన మార్పుల్ని కలిగించాలి. జీవనదిలా ప్రవహించే నిర్మల గంగానదిలా మనిషి జీవనం నిత్యచైతన్యంతో ముందుకు కదలాలని, నదిలో కొట్టుకుపోతున్నవాడికి తీరం తగిలినట్లుగా, కష్టాల్లో, బాధల్లో మునిగిపోయినవారికి ఒక ఓదార్పు, ఉపశమనం కలిగించే తీరంలా కవిత్వపుతీరు ఉండాలి.

పాతాళాన్ని పైకి లాగేదిగా, ఆకాశాన్ని భూమ్మీదికి దించేదిగా అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలిగే ఉత్తేజాన్ని కవిత్వం కలిగించాలి. అనేక సహజ వనరులతో, ప్రకృతి సౌందర్యంతో, విభిన్న ప్రాణుల జీవనానికి అనుగుణంగా ఉన్న అమూల్యమైన భూమిని, ఈ పర్యావరణాన్ని కాపాడుకునేలా కవిత్వం స్ఫూర్తి కలిగించాలి. మనిషి మానవీయ విలువలతో మంచి మనిషిగా ఎదిగేలా కవిత్వం నేర్పాలని కవి గాఢంగా కోరుకుంటున్న కోరిక ఈ కవిత.

## ఇవి చేయండి

### I అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది అంశాల గురించి మాట్లాడండి.**

1 'ఈప్స' కవితలోలాగా మీకు ఏమైనా కోరికలున్నాయా? నీ కోర్కెల గురించి ఎప్పుడైనా మీ అమ్మానాన్నలతో మాట్లాడారా? ఏమి మాట్లాడారు?

2 'ఈప్స' కవితలో కవి ప్రధానమైన కోరిక ఏమిటి? కవి తన గొడవ ఎలా ఉండాలని అనుకున్నాడు?

**ఆ) పాఠం చదివి కింది భావాలకు సంబంధించిన కవితాపంక్తులను కవితలో గుర్తించి రాయండి.**

1 కవిత సువాసనలాగా ఉండాలని

2 దాహంతో అల్లాడిపోయేవారికి దప్పిక తీర్చేదిగా ఉండాలని

3 చలికి గజగజ వణికిపోయేవారికి వెచ్చదనంలా ఉండాలని

**ఇ) కింది పేరా చదివి, ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఇంజనీరింగ్ చదివిన ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఉద్యోగంలో చేరకుండా, సంగీతంమీద గాఢమైన కోరికతో సాధనచేసి, భారతదేశంలో గొప్ప గాయకుడు అయ్యాడు. విద్యార్థిదశనుంచే క్రికెట్‌క్రీడ మీద కోరికతో చదువు పూర్తిచేయకుండానే సచిన్ టెండూల్కర్ క్రికెట్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నాడు. కారు ప్రమాదంలో కాలు తెగిపోయినా, నిరాశపడకుండా కృత్రిమపాదాన్ని

© SCERT not to be republished

అమర్చుకుని, నృత్యంమీద కోరికతో సాధనచేసి, మంచి నృత్యకారిణిగా పేరు తెచ్చుకుంది సుధాచంద్రన్. ఇటీవలే కేన్సర్ వ్యాధికి గురై చికిత్స చేయించుకొని మనోధైర్యంతో మళ్ళీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు యువరాజ్‌సింగ్. వీరందరు వ్యక్తిలో ఉన్న శక్తికి, మనోబలానికి, వారి గాఢమైన కోరికలకు, ఆత్మస్థైర్యానికి ప్రతీకలు. జీవితంలో ఎదురయ్యే బాధలకు భయపడకుండా ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొంటూ అనుకున్నది సాధించినవారే గొప్పవారవుతారు. ఇలాంటివారే ఈ తరానికి అసలైన స్ఫూర్తిదాతలు.

1. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గొప్ప గాయకుడు ఎలా అయాడు?
2. సచిన్ టెండూల్కర్ గొప్ప క్రీడాకారుడుగా ఎలా ఎదిగాడు?
3. యువరాజ్‌సింగ్ మనోధైర్యం ఎలాంటిది?
4. సుధాచంద్రన్‌కు జరిగిన ప్రమాదం ఏమిటి?
5. పై వారందరూ వేటికి ప్రతీకలు?
6. ఎవరు ఈతరానికి అసలైన స్ఫూర్తిదాతలు?

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. ఈప్స కవితలోని ముఖ్యమైన విషయం ఏమిటి?
2. 'పాతాళాన్ని పైకి లాగేదిగా వుండా'లనే మాటలకు అర్థాన్ని వివరించండి.
3. కవిత్వం ఎలా ఉండాలని కాళోజీ అనుకుంటున్నారు?
4. కవి ఎలా ఉండాలని కాళోజీ కోరుకున్నారు?
5. ఈ కవిత ద్వారా ఏం ప్రబోధించాలని కవి ఆశించారు?

## II వ్యక్తీకరణ- సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. కోరిక అంటే ఏమిటి? నీకున్న గాఢమైన కోరిక ఏమిటి?
2. కవిత్వం అమ్మ కంటి చూపుల్లా ఉండాలని కవి కోరుకున్నాడు కదా! దీనివల్ల మీరేమి గ్రహించారు?
3. 'ధాత్రిని ధాత్రిగా ఉంచేదిగా వుండాలనే' పంక్తుల్లోని అంతరార్థాన్ని తెలపండి.
4. గంగకు జీవనంగా, జీవానికి తీరంగా ఉండాలని కవి కోరుకుంటున్న భావాలను మీ సొంత మాటల్లో రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. 'ఈప్స' సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. పాఠం ఆధారంగా కవిత్వం ఎలా ఉండాలని మీకు అనిపిస్తుంది?
3. మనిషి మనిషిగా ఉండడమంటే ఏమిటి?

**ఇ) సృజనాత్మకంగా రాయండి.**

ఈ కవిత ఆధారంగా 'మన దేశం ఎలా ఉండా'లని కోరుకుంటున్నారో ఒక వ్యాసం రాయండి.

(లేదా)

కాళోజీ తన కవిత ఎలా ఉండాలని అనుకున్నాడో తెలిసింది కదా! అదేవిధంగా కథ ఎలా ఉండాలని మీరు అనుకుంటున్నారో కవితా రూపంలో రాయండి.

© SCERT not to be republished

**ఉ) ప్రశంసాత్మకంగా రాయండి.**

కాళోజీ తన కోరికను కవితాత్మకంగా రచించాడు కదా. ఈ కవితా విధానాన్ని, అంతరార్థాన్ని ప్రశంసిస్తూ సాహిత్యపత్రికకు ఒక వ్యాసం రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది ప్రకృతి పదాలకు వికృతులను, వికృతి పదాలకు ప్రకృతులను పాఠం ఆధారంగా గుర్తించి ఆ కవితా వాక్యాన్ని రాయండి.**

1. హృదయం 2. దివి 3. ప్రాణం 4. దరి

**ఆ) ఒకే శబ్ద, రూప సామ్యంగల పదాలను పాఠం ఆధారంగా గుర్తించి రాయండి. వాటిని అంత్యప్రాసగా వాడి రెండేసి వాక్యాలు రాయండి.**

ఉదా: దివి – భువి

1. బెడద 2. అరుణ 3. కులాసా 4. రీతి 5. భక్షణ

**ఇ) 'ఈప్స' కవిత ఆధారంగా 'గాలని' అనే అంత్యప్రాసను ఉపయోగిస్తూ ఈ కింది కవితను పూరించండి.**

"నాకున్నది కోరిక
నీకు విజయం కలగాలని
నీకు ........................... గాలని
మీకు ........................... గాలని
మీకు ........................... గాలని
నాకున్నది కోరిక!

### వ్యాకరణం

**అ) కింది సంధులకు ఈ పాఠం నుండి ఉదాహరణలు వెతికి రాసి, సూత్రాలు కూడా రాయండి.**

1. ఉత్వసంధి, 2. ఇత్వసంధి, 3. లు,ల,నల సంధి

**ఆ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాలను గుర్తించండి.**

1. నా గొడవ, 2. రైతుచూపు, 3. కంటిచూపు, 4. బలిత్యాగం

### ప్రాజెక్టు పని

కాళోజీ 'నా గొడవ' కవితా సంపుటిని సేకరించి, నీకు నచ్చిన రెండుకవితలను రాసి గోడ పత్రికలో ప్రదర్శించండి.

**సౌందర్యం దృష్టిని బట్టిమారుతుంది.**
**సౌజన్యం ఎప్పుడూ ఆదరింపబడుతుంది.**